"ఆపరేషన్ సిందూర్‌లో కనీసం 100 మంది ఉగ్రవాదులు మరణించారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నది. వివరాల సేకరణ ఇంకా జరుగుతున్నది. అందుకే మరణాలపై కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నాం. పాక్ దాడులు చేస్తే తగిన జవాబిస్తాం.
– రాజ్‌నాథ్ సింగ్

ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది!

- పాక్ దాడులు చేస్తే గట్టిగా జవాబిస్తాం
- అఖిలపక్ష భేటీలో రాజ్‌నాథ్ ఉద్ఘాటన
- ప్రభుత్వానికి అన్ని పార్టీల మద్దతు

భారత దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీరులోని(పీఓకే) ఉగ్రవాద స్థావరాలపై భారత సైనిక దళాలు జరిపిన దాడులలో 100 మంది ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం అఖిల పక్ష సమావేశంలో వెల్లడించారు. పాకిస్థాన్ దాడులు జరిపితే భారత్ తిప్పికొడుతుందని ఆయన సమావేశంలో ప్రకటించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సైనిక చర్యను పూర్తిగా సమర్థించిన అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా అమలు చేసినందుకు సాయుధ దళాలను అభినందించారు. సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, ఏఐఎంఐఎం, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఎన్‌సీపీ, ఆప్, శివసేన(యూబీటీ), ఎల్‌జేపీ తోసహా వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతీయ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందచేస్తామని ప్రకటించారు. ఈ సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి అండగా ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమావేశం అనంతరం విలేకరుల వద్ద ప్రకటించారు. ఇది చాలా సున్నితమైన సమయమని, దేశ ప్రయోజనాలకు సంబంధించిన సందర్భమని రక్షణ మంత్రి సమావేశంలో తెలిపారని, అందుకే తాము సవివరంగా ప్రశ్నలేమీ అడగలేదని ఖర్గే తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్‌లో కనీసం 100 మంది ఉగ్రవాదులు మరణించారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. వివరాల సేకరణ ఇంకా జరుగుతోంది. ఈ కారణంగా మరణాల సంఖ్యపై కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వలేకపోతున్నాము. పాకిస్థాన్ దాడులు చేస్తే భారత్ తగిన జవాబు ఇస్తుంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

సమావేశం సజావుగా సాగింది

అఖిలపక్ష సమావేశం సజావుగా జరిగిందని, సమావేశానికి హాజరైన నాయకులు పరిపక్వంగా వ్యవహరించడమేగాక ఏ విధమైన అభిప్రాయ భేదాలను బయటపెట్టలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సమావేశం అనంతరం విలేకరులకు తెలిపారు. పాక్‌పై సైనిక దాడి విషయమై విస్తృతమైన రాజకీయ ఏకాభిప్రాయాన్ని తీసుకువచ్చేందుకు రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగినట్లు ఆయన చెప్పారు. తమ ఎదుట ఉన్న అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమావేశంలో నిర్మాణాత్మకంగా చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. ఆపరేషన్ సిందూర్ గురించి రాజ్‌నాథ్ నాయకులందరికీ సమగ్రంగా వివరించారని, ప్రతి నాయకుడూ బాధ్యతతో, పరిపక్వతతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని రిజిజు చెప్పారు. ఇటువంటి క్లిష్ట సమయంలో రాజకీయాలకు తావు లేదని పార్టీలకు అతీతంగా నాయకులందరూ స్పష్టం చేశారని ఆయన చెప్పారు.

సంపూర్ణ సహకారం:విపక్షాలు

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారాన్ని ప్రకటించినట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశం అనంతరం విలేకరులకు తెలిపారు. ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని రాహుల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలతోపాటు ఇతర పార్టీలు కూడా ముక్త కంఠంతో ప్రభుత్వానికి, సాయుధ దళాలకు అండగా ఉంటామని ప్రకటించాయని రాహుల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సమావేశంలో పాల్గొనకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు సాయుధ దళాలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలియచేసినట్లు ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అఖిలపక్ష సమావేశం అనంతరం విలేకరులకు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహించిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)కి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా ప్రచారం చేపట్టాలని ఆయన సూచించారు. టీఆర్ఎఫ్‌ని ఉగ్రవాద సంస్థగా ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి ప్రకటించాలని ఆయన కోరారు. టీఆర్ఎఫ్‌ని విదేశీ ఉగ్ర సంస్థగా అమెరికా తన దేశంలో ప్రకటించాలని కూడా అమెరికా ప్రభుత్వాన్ని కోరాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న పలువురు కేంద్రమంత్రులు, ప్రతిపక్షాల నాయకులు

విలేకరుల సమావేశంలో ఉగ్రవాదుల అంత్యక్రియలపై ఆధారాలు చూపుతున్న మిస్రీ

ఉద్రిక్తతలకు తెరలేపింది పాకే

- భారత్ కేవలం ప్రతిస్పందించింది
- ఇప్పటికైనా ఘర్షణ ఆపాల్సింది ఆ దేశమే
- జమ్ములో గురుద్వారాలపై దాడులు చేసింది
- ఉగ్రవాదులకు 'లాంఛనాలతో' అంత్యక్రియలా?
- మీడియాతో విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ

న్యూఢిల్లీ, మే 8: ఉభయ దేశాల మధ్య ఉద్రిక్తతలకు తెరలేపింది తొలుత పాకిస్థాన్ అని భారత్ స్పష్టంచేసింది. గత నెల 22న పహల్గాంలో పాక్ ఉగ్రమూకలు 26 మంది అమాయకులను పొట్టనబెట్టుకోవడంతో ఇది మొదలైందని తెలిపింది. ఆ దాడికి భారత సాయుధ దళాలు బుధవారం జవాబు చెప్పాయని పేర్కొంది. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ గురువారం సాయంత్రం కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. తమ దాడుల్లో సామాన్య పౌరులుగానీ, పాక్ సైనిక సదుపాయాలు గానీ ధ్వంసం కాలేదని చెప్పారు. కానీ, జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ జరుపుతున్న ప్రతీకార దాడుల్లో భారతీయ పౌరులు మరణిస్తున్నారని తెలిపారు.

గురుద్వారాలపై పాక్ దాడులు

జమ్ముకశ్మీర్‌లో సిక్కులు లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడుతున్నదని మిస్రీ చెప్పారు. పూంచ్ జిల్లాలో పాక్ జరిపిన దాడిలో ఒక గురుద్వారా ధ్వంసమైందని, పలువురు సిక్కుల ఇండ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించారని చెప్పారు. పాక్ సైన్యం సరిహద్దుకు అవతలి నుంచి జరుపుతున్న కాల్పుల్లో ఇప్పటికి 16 మంది పౌరులు మరణించారని వెల్లడించారు.

ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్ర బిందువు పాక్

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై జరిపిన దాడుల్లో మృతిచెందిన ముష్కరులకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్‌కు ఇది అలవాటుగా మారిందని పేర్కొంది. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు ప్రదర్శించిన ఒక చిత్రంలో.. ఉగ్రవాదుల మృతదేహాలను ఉంచిన శవపేటికల వద్ద సైనిక దుస్తుల్లో ఉన్న పాక్ సైన్యం, పోలీసు సిబ్బంది ప్రార్థనలు చేస్తుండగా, వారికి లష్కరే తాయిబా ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రవూఫ్ వారిని ప్రార్థనలలో నడిపిస్తున్నాడు. ఈ ఫొటో ఎటువంటి సందేశం ఇస్తున్నది అని మిస్రీ ప్రశ్నించారు.

మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నా

- భారత్, పాక్ శాంతించాలి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

న్యూయార్క్, మే 8: భారత్, పాక్ దేశాలు శాంతించాలని, ఒకరిపై మరొకరు దాడులు చేయడం వెంటనే ఆపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. అవసరమైతే తాను మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. 'రెండు దేశాలు ఒకరిపై మరొకటి కయ్యానికి కాలుదువ్వుతున్నాయి. పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. వెంటనే యుద్ధాన్ని ఆపాలని కోరుతున్నా. రెండు దేశాలతో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. అవసరమైతే మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నా' అని ట్రంప్ తెలిపారు.రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్టు అమెరికా ఆర్మీ అధికారి క్లార్క్ తెలిపారు.

లాహోర్‌ను వీడండి

తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ

లాహోర్: లాహోర్ గగనతల రక్షణ వ్యవస్థ లక్ష్యంగా దాడులు జరిగాయన్న వార్తల నేపథ్యంలో ఆ నగరాన్ని వెంటనే వీడాలని అమెరికా తన పౌరులకు గురువారం అడ్వైజరీ జారీ చేసింది. ఆయా ప్రాంతాలను వదిలి వెళ్లే అవకాశం లేనివారు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని కోరింది. లాహోర్‌లోని అమెరికా రాయబార కార్యాలయం తన సిబ్బందికి ఆదేశాలను జారీ చేసింది. భద్రత దృష్ట్యా ఘర్షణలు జరిగే ప్రాంతాలను వదిలి వెళ్లాలని సూచించింది.

జమ్ముకశ్మీర్‌కు వెళ్లొద్దు

తమ దేశ పౌరులకు యూఎస్, యూకే సహా పలు దేశాల సూచన

న్యూఢిల్లీ : ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాలు, జమ్ముకశ్మీర్‌లో వివిధ పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ఇప్పుడు సరైన సమయం కాదంటూ ఆయా దేశాలు తమ పౌరులకు సూచించాయి. భారత్–పాక్ సరిహద్దు ప్రాంతాలు, జమ్ముకశ్మీర్ పర్యటనలు, ప్రయాణాలకు దూరంగా ఉండాలి.. అంటూ అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ సహా పలు దేశాలు తమ పౌరులకు అడ్వైజరీ జారీ చేశాయి. భారత్‌లో పరిస్థితులను దగ్గర్నుంచి పరిశీలిస్తున్నామని, సంక్షోభ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల నుంచి అమెరికన్లు వెంటనే వైదొలగాలని.. న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించండి

భారత్, పాకిస్థాన్‌కు రూబియో పిలుపు

న్యూఢిల్లీ, మే 8: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఉభయ దేశాలకూ పిలుపునిచ్చారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఇరుదేశాల మధ్య చర్చలకు యూఎస్ మద్దతు ఉంటుందని, సంప్రదింపులు జరగాలని ఆకాంక్షించారు. హల్గాం ఉగ్రదాడిని ఖండించిన రూబియో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ జరిపే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రధాని మోదీతో అజయ్ బంగ భేటీ

ఒప్పందానికి మధ్యవర్తిగా ఉన్న ప్రపంచ బ్యాంకు

న్యూఢిల్లీ, మే 8: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ప్రపంచ బ్యాంకు గ్రూపు అధ్యక్షుడు అజయ్ బంగ గురువారం ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకున్నారు. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీరు(పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ వైమానిక దాడులు జరిపిన మరుసటిరోజే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. తొమ్మిదేండ్లపాటు సుదీర్ఘంగా సాగిన చర్చలకు ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వం వహించింది.

మా సహనాన్ని పరీక్షించవద్దు

బలూచ్ ఆర్మీ దాడిలో 12 మంది పాక్ సైనికుల మృతి

న్యూఢిల్లీ: పాకిస్థాన్ సైన్యంపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మరోమారు విరుచుకుపడింది. బలూచిస్థాన్‌లో మంగళవారం జరిపిన శక్తిమంతమైన ఐఈడీ బాంబు దాడిలో పన్నెండు మంది పాక్ సైనికులు మృతి చెందారు. కచ్చి జిల్లాలోని మాచ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని బీఎల్ఏ ఐఈడీ పేల్చిందని ఆర్మీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇటీవల కొంతకాలంగా బలూచిస్థాన్ వ్యాప్తంగా సైన్యం కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కొన్ని రోజుల క్రితం 30–40 మంది సాయుధులు ప్రావిన్సుకు దారితీసే హైవేను దిగ్బంధించి పోలీసు ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని అడ్డుకున్నారు. ఐదుగురు అధికారులను బందీలుగా పట్టుకున్నారు.

పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: భారత్, పాక్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. తమను రెచ్చగొడితే 'తీవ్ర ప్రతిస్పందన' ఉంటుందని తేల్చిచెప్పారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న పాకిస్థాన్ 15 భారత సైనిక స్థావరాలపై దాడులకు యత్నించింది. ప్రతిగా పాకిస్థాన్‌లోని అనేక వైమానిక, రక్షణ రాడార్‌లను లక్ష్యంగా చేసుకున్న భారత్ గురువారం లాహోర్‌లోని రాడార్ వ్యవస్థను ధ్వంసం చేసింది. ఢిల్లీలో జరిగిన 'నేషనల్ క్యాపిటల్ కాన్క్లేవ్'లో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ.. తాము ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరిస్తామని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వసిస్తామని చెప్పారు. అంతమాత్రాన తమ ఓపికను దుర్వినియోగం చేయవచ్చని దీని అర్థం కాదని నొక్కి చెప్పారు. ఎవరైనా దీనిని అలుసుగా తీసుకోవాలని ప్రయత్నిస్తే 'తీవ్ర ప్రతిస్పందన'ను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేశారు. భారత సాయుధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ ప్రశంసించారు. పాకిస్థాన్, పీవోకేలో ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసిన తీరు మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలపై దాడులు చాలా కచ్చితత్వంతో జరిగాయని, ఈ దాడుల్లో సామాన్యులకు ఎలాంటి హాని జరగలేదని వివరించారు. శిక్షణ పొందిన దళాలు అత్యంత నాణ్యమైన పరికరాలను కలిగి ఉండటం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. రక్షణ ఉత్పత్తిలో నాణ్యత, పరిమాణంపై తమ ప్రభుత్వం సరిసమానంగా దృష్టిసారించిందని, వేగవంతమైన అభివృద్ధిని తీసుకొచ్చేందుకు ఆయుధ కర్మాగారాల కార్పొరేటీకరణ సహా అనేక విప్లవాత్మక చర్యలు తీసుకున్నట్టు రాజ్‌నాథ్ వివరించారు.

ఖబడ్దార్.. దాడి చేస్తే: జైశంకర్ హెచ్చరిక

పాకిస్థాన్‌తో పరిస్థితిని(ఉద్రిక్తతలను) ఉల్లంఘించాలనే ఉద్దేశం భారత్‌కు లేదని.. కానీ తమ దేశంపై సైనిక దాడులు జరిగితే.. వాటికి స్పందన తీవ్రంగా ఉంటుందని విదేశాంగ మంత్రి జైశంకర్ గురువారం వ్యాఖ్యానించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్‌తో సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. క్రూరమైన పహల్గాం ఉగ్ర దాడి కారణంగానే తాము దేశ సరిహద్దు దాటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాల్సి వచ్చిందన్నారు. తమ దాడులు నిర్దిష్ట లక్ష్యాలపైనే సాగాయన్నారు. పొరుగు దేశంగా, సన్నిహిత భాగస్వామిగా ఇరాన్ ఈ పరిస్థితిని సరిగా అర్థం చేసుకోవడం ముఖ్యమని జైశంకర్ అన్నారు.

అన్ని వేళలా సంసిద్ధంగా ఉండాలి

కీలక శాఖల కార్యదర్శులకు మోదీ ఆదేశం

న్యూఢిల్లీ, మే 8: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వివిధ మంత్రిత్వశాఖలకు చెందిన కార్యదర్శులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. జాతీయ భద్రత, నిర్వహణా సన్నద్ధతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించిన ప్రధాని నిరంతరం అప్రమత్తంగా, స్పష్టమైన సమాచారంతో ఉండాలని సమావేశంలో పిలుపునిచ్చారు. సివిల్ డిఫెన్స్ యంత్రాంగాలను బలోపేతం చేయడం, తప్పుడు సమాచారాన్ని, తప్పుడు వార్తలను తిప్పికొట్టేందుకు చర్యలు చేపట్టడం, కీలకమైన మౌలిక సౌకర్యాల భద్రత కల్పించేలా చూడడం తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించినట్లు ప్రధాని కార్యాలయం(పీఎంఓ) ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రాల అధికారులు, క్షేత్ర స్థాయి సంస్థలతో సమన్వయం చేసుకోవాలని కూడా మంత్రిత్వ శాఖలకు ప్రధాని సూచించారు. జాతీయ భద్రతకు సంబంధించి తాజా పరిణామాల నేపథ్యంలో జాతీయ సంసిద్ధతను సమావేశంలో సమీక్షించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

ఫేక్ వార్తలకు చెక్

ఫ్యాక్ట్ చెక్ చేయండిలా

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): భారత్–పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ దాయాది దేశం ఫేక్ వార్తలను విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే factcheck.telangana.gov.in వెబ్‌సైట్, కేంద్రం ఆధ్వర్యంలో నడిచే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)లు పౌరులకు కచ్చితమైన సమాచారం అందిస్తున్నాయి.

పీఐబీలో ఫాక్ట్ చెక్ చేయండిలా..

భారత ప్రభుత్వం పీఐబీ ఆధ్వర్యంలో నకిలీ వార్తలను అరికట్టే లక్ష్యంతో 2019లో ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను స్థాపించింది. పౌరులు ఏదైనా వార్త ఫేక్ న్యూస్ లేదా ఒరిజినల్ న్యూస్ అని తెలుసుకోవాలంటే వాట్సాప్, ఈమెయిల్, వెబ్ పోర్టల్ ద్వారా తమ అభ్యర్థనలు పంపాల్సి ఉంటుంది. PIBFactCheck ఎక్స్(ట్విట్టర్) అకౌంట్, PIBFactCheck ఫేస్‌బుక్ ద్వారా అభ్యర్థన పంపొచ్చు. లేదా Factcheck @pib.gov.in, socialmedia @pib.gov.in కు మెయిల్ చేయాల్సి ఉంటుంది. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ వార్త ఒరిజినలా.. లేదా ఫేకా అనేది నిర్ధారించుకున్న తర్వాత బహిరంగంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వివరాలను వెల్లడిస్తుంది.

ఫ్యాక్ట్ చెక్ తెలంగాణలో ఇలా..

కరోనా సమయంలో ఫేక్ న్యూస్ విస్తృతంగా వ్యాప్తిచెందడంతో తెలంగాణలో ఫాక్ట్ చెక్ పోర్టల్‌ను 2020లో ప్రారంభించారు. పౌరులు 'ఫ్యాక్ట్ చెక్ తెలంగాణ'లో ఫేక్, ఒరిజినల్ న్యూస్‌ను తరచి చూసుకునే వీలు కల్పించారు. తాజాగా భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా అనేక ఫేక్ న్యూస్‌లు సోషల్‌మీడియాలో విస్తృతంగా వ్యాప్తిచెందుతున్నాయి. పౌరులు ఆయా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వచ్చిన వార్తలను గుడ్డిగా నమ్మకుండా అది ఒరిజినల్ వార్తా.. లేక ఫేక్ వార్తా అనే విషయాన్ని factcheck.telangana.gov.in వెబ్‌సైట్‌కు లేదా.. FactCheck_Telangana ఎక్స్ (ట్విట్టర్) ఖాతాకు అభ్యర్థనలు పంపొచ్చు. ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు ఫేక్ వార్తల పట్ల అలర్ట్‌గా ఉండి.. కచ్చితమైన సమాచారాన్ని నిర్ధారణ చేసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను కోరాయి.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం భారత్ హక్కు

- పహల్గాం ముష్కరులను శిక్షించాల్సిందే
- ఆపరేషన్ సిందూర్‌ను సమర్థించిన ఈయూ

న్యూఢిల్లీ, మే 8: పహల్గాం ఉగ్రదాడిని గురువారం ఖండించిన యూరోపియన్ యూనియన్.. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు భారత్‌కు ఉన్న హక్కును సమర్థించింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్న సమయంలో ఈయూ నుంచి ఈ మేరకు ప్రకటన వెలువడింది. పహల్గాం దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిందేనని ఈయూ స్పష్టం చేసింది. 'ఉగ్రవాదం ఎప్పటికీ సమర్థనీయం కాదు. దాడికి బాధ్యులైన వారిని న్యాయపరంగా శిక్షించాలి. ఉగ్ర చర్యల నుంచి తమ పౌరులను రక్షించుకునే హక్కు ప్రతి రాజ్యం బాధ్యతతోపాటు హక్కు' అని ఈయూ తన ప్రకటనలో తెలిపింది. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఉభయ పక్షాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి సయంమనం పాటించాలని, రెండు వైపులా పౌరుల ప్రాణాలను పరిరక్షించుకునేందుకు దాడులు కొనసాగించరాదని ఈయూ విజ్ఞప్తి చేసింది. భారత్, పాక్ చర్చలు చేపట్టాలని కోరిన ఈయూ అంతర్జాతీయ చట్ట నిబంధనలకు లోబడి రెండు దేశాలు తమ పౌరుల జీవితాలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కోరింది.

పరిస్థితిని మరింత క్లిష్టతరం చేయొద్దు..

ఇరు దేశాల మధ్య నెలకొన్న పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే చర్యలకు దూరంగా ఉండాలని భారత్, పాకిస్థాన్‌లను చైనా కోరింది. శాంతి, స్థిరత్వం లోని విస్తృత ప్రయోజనాలకు అనుగుణంగా ఇరు దేశాలు వ్యవహరించాలని, రెండు దేశాలు సంయమనం పాటించాలని చైనా సూచించింది. గురువారం బీజింగ్‌లో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుత పరిణామాలపై చైనా ఆందోళనగా ఉన్నట్టు తెలిపారు. ఐక్యరాజ్యసమితి నిబంధనలు సహా, అంతర్జాతీయ చట్టాల్ని పాటించాలని, పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే చర్యలకు ఇరు దేశాలు దూరంగా ఉండాలని.. రెండు దేశాలను తాము కోరుతున్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుత ఉద్రిక్తతలను తగ్గించటంలో అంతర్జాతీయ సమాజంతో కలిసి నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి చైనా సిద్ధంగా ఉందని అన్నారు.

'ఆపరేషన్ సిందూర్'కు బ్రిటన్ ఎంపీ మద్దతు

లండన్ : పహల్గాం ఉగ్ర దాడిని బ్రిటన్ పార్లమెంటు సభ్యురాలు ప్రీతీ పటేల్ ఖండించారు. ఉగ్రవాద నిరోధక చర్యలను భారత్‌తో కలిసి పటిష్టపరచాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని కోరారు. పాకిస్థాన్ నుంచి పని చేస్తున్న ఉగ్రవాద సంస్థలు సృష్టిస్తున్న సీమాంతర ముప్పును గుర్తించాలని బ్రిటన్‌ను కోరారు. యూకే హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాట్లాడుతూ ఆమె ఈ పిలుపునిచ్చారు. భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు సడలిపోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సైనికపరమైన ఉద్రిక్తతలను నివారించాలన్నారు. భారత్‌ను నిరంతరం బెదిరిస్తున్న, భారతీయుల మరణాలకు కారణమైన ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసే హక్కు భారత్‌కు ఉందన్నారు.

పాక్ గగనతలం వినియోగించని విదేశీ ఎయిర్‌లైన్స్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్ గగనతలాన్ని విదేశీ ఎయిర్‌లైన్స్ వినియోగించడం లేదు. జర్మనీ వైమానిక సంస్థ లుఫ్తాన్సా గ్రూప్ గురువారం స్పందిస్తూ, తమ విమానాలు పాకిస్థాన్ గగనతలం మీదుగా ప్రయాణించబోవని తెలిపింది. దీనివల్ల భారత్ సహా ఆసియా దేశాలకు ప్రయాణ సమయం పెరుగుతుందని చెప్పింది. ప్రయాణికులు తమ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా వివరాలను తెలుసుకోవాలని సూచించింది. తమ విమానాలు పాకిస్థాన్ గగనతలం మీదుగా ప్రయాణించబోవని బ్రిటన్‌లోని వర్జిన్ అట్లాంటిక్ తెలిపింది. దీనివల్ల లండన్–ఢిల్లీ విమానాలను వేరొక మార్గంలో నడుపుతామని ప్రకటించింది.